నేటి దినపత్రిక
# సూర్య
17వ వసంతంలోకి...
## ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 26 జులై 2024



## ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### విమానయాన శాఖ మంత్రిని కోరిన ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** గన్నవరం ఎయిర్పోర్ట్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని లోక్ సభలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని అన్నారు. అదేవిధంగా గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి సింగపూర్, థాయ్ లాండ్, శ్రీలంకకు విదేశాలకు వెళ్లేలా విమాన సర్వీస్లు, విజయవాడ నుంచి వారణాసి, కలకత్తా, తిరుపతికి నూతన సర్వీస్లను, ఢిల్లీ – వైజాగ్ కనెక్టివిటీ ఫ్లైట్ సర్వీసులను తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎంపీ బాలశౌరి కేంద్ర మంత్రి రామ్మోహన్‌ని కోరారు.



# అలక్ష్యం చేయెుద్దు

- చేనేత ఎగ్జిబిషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**విజయవాడ మేజర్ న్యూస్ :** వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే చేనేత ఎగ్జిబిషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, సౌకర్యాల కల్పనలో అలక్ష్యం చేయెుద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు సందర్భంగా... నగరంలోని మేరీస్ స్టెలా కాలేజీ, ఏ ప్లస్ కన్వన్షన్ సెంటర్ ను గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా మేరీస్ స్టెల్లా కాలేజీని పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని చేనేత శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం ఏ ప్లస్ కన్వీన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. సీఎం చంద్రబాబునాయుడు జాతీయ చేనేత దినో త్సవం సందర్భంగా నిర్వహించే చేనేత ఎగ్జిబిషన్లను ప్రారంభించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహా పలువురు మంత్రులు పాల్గొనే అవకాశముందన్నారు. మిగతా 2లో...

# సంతృప్తే ప్రధానం

- ప్రజల యోగక్షేమాలే లక్ష్యం
- వీఎంసీ నూతన కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర బుధవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖాధిపతులందరూ కమిషనర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సంతృప్తే ప్రధానంగా, ప్రజల యోగక్షేమాలే లక్ష్యంగా విజయవాడ నగరపాలక సంస్థ పనిచేస్తుందని అన్నారు. నగర పరిధిలో ఉన్న 64 వార్డుల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ నిర్వహణలో జాతీయ ప్రమాణాలతో మెరుగుపడేటట్లు చూసుకుంటామని, ప్రజలకు కేవలం సురక్షితమైన తాగునీటినే సరఫరా చేసేటట్టు చూసుకుంటామని, సైడ్ డ్రైన్లలో తాగునీటి పైప్ లైన్లో లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటూ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేటట్టు చూసుకుంటామని, వాడకంలో ఉన్న నీరును కూడా సివేజ్ ట్రీట్మెంట్ ద్వారా మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకోబోతున్నామని, నగరంలో పచ్చదనాన్ని మరింత పెంచుతామని తద్వారా కాలుష్యాన్ని నివారించడమే కాకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన మిగతా 2లో



## డిప్యూటీ సీఎంని కలిసిన ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ డైరెక్టర్

### రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాల విస్తరణపై చర్చ

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ డైరెక్టర్ (మార్కెటింగ్) వి. సతీష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలోని ఉప ముఖ్యమంత్రివారి కార్యాలయంలో కలిశారు. తమ సంస్థ కార్యకలాపాలను ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వివరించారు. రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు.

– **విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :**

# కాలనీకి దారేది..

- రహదారి లేక ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- కనీస మౌళిక సదుపాయాలు కూడా సమకూర్చలేకపోయిన గత ప్రభుత్వం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జగనన్న కాలనీకి రహదారి లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు గృహం ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా నివేశిన స్థలాలను అందచేశారు. కానీ ఆ స్థలాల్లో కనీస మౌళిక సదుపాయాలు కూడా సమకూర్చలేకపోయారు. అవనిగడ్డ నుండి పాత ఎడ్లంక వెళ్ళే రహదారి పక్కన మామిడి తోటల్లో 807 మంది లబ్ధిదారులకు నివేశిన పట్టాలు అందచేశారు. నివేశిన స్థలాలు మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## అలక్ష్యం చేయొద్దు



అతిథుల కార్ల పార్కింగ్, చేనేత కార్మికులు, సందర్శకులకు సౌకర్యాల కల్పనపై ప్రధాన దృష్టి సారించాలని స్పష్టం చేశారు. చేనేత కార్మికులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించే అవకాశముందని, ఇందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల ఏడో తేదీ నుంచి పది రోజుల పాటు జరిగే చేనేత ఎగ్జిబిషన్లను ప్రజలు సందర్శించేలా విస్తృతమైన ప్రచారం కల్పించాలన్నారు. చేనేత కార్మికుల్లో అవగాహన కల్పించి, ఈ చేనేత ఎగ్జిబిషన్ లో అత్యధిక స్టాళ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ స్టాళ్లలో చీరలు, ఇతర చేనేత వస్త్రాల విక్రయాల ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగే అవకాశముందన్నారు. ప్రస్తుతం ఎంత మంది స్టాళ్లు ఏర్పాటుకు ముందుకొచ్చారని మంత్రి ఆరా తీశారు. 80 స్టాళ్లు ఏర్పాటు చేసే అవకాశముందని, ఇందు కోసం 300ల మంది చేనేత కార్మికులు రానున్నారని మంత్రికి అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, స్టాళ్లు ఏర్పాటుకు వచ్చే చేనేత కార్మికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎగ్జిబిషన్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాలనీకి దారేది ?



ఇచ్చిన వెంటనే గృహాలు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించినప్పటికి లబ్ధిదారులు పెద్దగా ఆశక్తి చూపలేదు. తదుపరి రెండవ పర్యాయంగా 350 గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. సుమారు 250 మంది ముందుకు వచ్చి గృహ నిర్మాణాలు ప్రారంభించారు. వీటిలో సుమారుగా 50 గృహాలు పూర్తి కాగా కేవలం 15 కుటుంబాల వారు మాత్రమే నిర్మించిన గృహాల్లోకి ప్రవేశం చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొ లబ్ధిదారునికి 1.80 లక్షలు మంజూరు చేయగా వాటికి తోడు మరో 10 లక్షలు అప్పు చేసి గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వం జగనన్న కాలనీలో కనీస మౌళిక వసతులైన రహదారి, త్రాగునీరు,విద్యుత్ వంటివి ఏర్పాటు చేయలేకపోయింది. ఈ కాలనీలోనికి వెళ్ళే ప్రధాన రహదారిని సైతం ప్రభుత్వం విస్మరించడంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడి ఎన్నో వ్యవయప్రయాసలు కూర్చి గృహ నిర్మాణాలు చేసుకుంటున్నారు. 356 గృహాలు మంజూరు కాగా 250 గృహాలు పలు పలు దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి. మరో 100 మంది మాత్రం గృహ నిర్మాణం చేపట్టేందుకు ఆశక్తి చూపలేదు. ప్రభుత్వం కూడా ఆ దిశగా నిర్మాణాలు చేపట్టేందుకు అవగాహన కల్గించడం కానీ, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయడం కానీ జరగలేదు. 15 కుటుంబాల వారు నివాసం ఉంటూ ఉండగా వీరికి ఆ రహదారిలో వెళ్ళాలంటే నరకం ఎలా ఉంటుందో తెలియని వారికి నరకం ఇక్కడే కనిపిస్తుంది. నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలో మౌళిక వసతులపై శ్రద్ధ పెడుతుందో లేదో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



# సంతృప్తే ప్రధానం

## ప్రజల యోగక్షేమాలే లక్ష్యం : వీఎంసీ నూతన కమిషనర్ ధ్యానచంద్ర







(మొదటిపేజీ తరువాయి)

జీవనాన్ని కల్పించవచ్చని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వస్తున్న ప్రాజెక్టుల ను కూడా సంపూర్ణంగా అమ లు చేసే దిశగా విజయవాడ నగరపాలక సంస్థ పనిచేస్తుందని తెలిపారు. తదుపరి బాధ్యతలు స్వీకరించిన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రకి, కార్పొరేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. తమకి శుభాకాంక్షలు అందచేయడానికి వచ్చిన ప్రతి ఒకరితో వారి పరిచయాలు తెలుసుకొని, వారికి ధన్యవాదాలు చెప్పారు.















# వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గురువారం నాడు శాసనసభలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ టీడీపీ హయాంలో దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రద్దు చేసి జగన్ రెడ్డి వారి పొట్ట కొట్టారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఎస్సీ ఎస్టీల కోసం నూతన పారిశ్రామిక విధానం అమలు చేయలేదని విమర్శించారు. బి %ఏ% సి కేటగిరి కింద మెడికల్ సీట్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయలేదన్నారు. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులకు 41 సీఆర్పీసీ కింద స్టేషన్ బెయిల్ మంజూరు చేశారని అన్నారు. ఎస్సీలకు ఇళ్ల నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.50,000 అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా నిలిపేశారని వివరించారు. ఉద్యోగాల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ చట్టం సక్రమంగా అమలు కాలేదు. ఎస్సీలకు పథకాల అమలులో ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎస్సీ నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉన్న అమరావతి రాజధాని నిర్మాణం నిలిపేశారని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. దళితులకు మేనమామ అని చెప్పుకునే జగన్ రెడ్డి కంసమామలా మారి వారికి ద్రోహం చేశారని అన్నారు. అందుకే దళితులు తిరగబడి రాష్ట్రంలో వైసీపీని తరిమి కొట్టారని అన్నారు. గత టిడిపి హయాంలో దళితులకు అన్ని విధాల మేలు చేశామని మంత్రి అన్నారు. 2014 - 2019 లో ఐఎస్ బి సెక్టార్, పశుసంవర్ధక శాఖ కింద బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా 60 శాతం సబ్సిడీతో రూ.2716.70 కోట్లతో 2,02,414 మంది ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చామని తెలిపారు. భూమిలేని పేదలకు భూమి కొనుగోలు పథకం ద్వారా రూ. 197 కోట్లతో 2,518 మందికి 2360.77 ఎకరాల భూమి పంపిణీ చేశామని, %చీూఖీణజ% కింద రూ. 552.55 కోట్లతో 10,634 మంది ఎస్సీ యువతకు ఇన్నోవా కార్లు, రవాణా రంగంలో అధిక విలువ గలిగిన ప్రాజెక్ట్ ఆధారిత యూనిట్లు అందించామన్నారు.ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా ద్వారా రూ. 29.39 కోట్లతో 669 మందికి ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు లాంటి మెట్రోపాలిటన్ సిటీల్లో ఉచితంగా సివిల్స్ కోచింగ్ అందించామని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ ద్వారా రూ.165.29 కోట్లతో 23,389 మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించమన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.32.23 కోట్లతో 437 మంది విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించామని మంత్రి స్పష్టం చేశారు. కానీ జగన్ రెడ్డి మాత్రం ఆ పథకానికి అంబేద్కర్ పేరు మార్చి తన పేరు పెట్టుకుని అంబేద్కర్ నే అవమానించారని అన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలన్నీ త్వరలోనే తిరిగి పునరుద్ధరిస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

# రెవెన్యూ ఇన్స్పెక్టర్ యు.ఆనంద్ బాబు అక్రమాలపై సమగ్ర విచారణ జరపండి

## రికార్డుల తారుమారు చేయకుండా వేరే మండలానికి మార్చండి....



**జగ్గయ్యపేట జూలై 25 మేజర్ న్యూస్ :** మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ యు.ఆనంద్ బాబు పాల్పడిన పలు అక్రమాల ఫిర్యాదులు పై విచారణ జరుగుతున్నందున వాటి రికార్డులు తారుమారు చేసే ప్రమాదం ఉన్నందున ఆర్.ఐ.ఆనంద్ బాబు ని వేరే మండలానికి మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారిని గుడగుంట్ల విజయ రాజు కోరారు. నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి తదితర శాఖల అధికారులకు పంపిన ఫిర్యాదు కాపీలను మీడియాకు విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా యు ఆనంద్ బాబు తన హోదాను అడ్డుపెట్టుకొని అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆర్ ఐ ఆనందబాబు సారధ్యంలో జరిగిన కొన్ని అక్రమాలను తెలియజేశారు. 1)నిబంధనలకు విరుద్ధంగా ఎకరం ప్రభుత్వ భూమిని తన పేరున భూమి హక్కు పత్రాలను కూడా పొందడం జరిగింది. 2) తిరుమలగిరి గ్రామంలోని కరిసే ఇందిరా జాస్మిన్ కి అక్రమంగా సుమారు రెండు ఎకరాల భూమిని కట్టబెట్టారు. 3) వేదాద్రి గ్రామంలో రిటైర్డ్ విఆర్ఓ నరసింహారావు కు సంబంధించిన భూమిని కూడా ఇతరులకు సిఫారసు చేసి భూమిని మంజూరు చేయించడం జరిగింది. 4.తిరుమలగిరి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ :104 లోని ప్రభుత్వ వ్యవసాయ భూమిని లోకాయుక్త ఆదేశాలను ఖాతరు చేయకుండా.నిబంధనలకు విరుద్ధంగా తిరిగి అక్రమంగా కట్టబెట్టేందుకు ప్రయత్నం చేశారు. 5. తోర్రగుంటపాలెం లోని షేక్ రజాక్ వారి వెంచర్కు నిబంధనల విరుద్ధంగా ప్రభుత్వభూమిని కేటాయించారు. 6. ఇసుక. మట్టి. అక్రమ రవాణాకు అనధికార అనుమతులను ఇవ్వడం జరిగింది. 7. గ్రామకంఠం, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లకు ఒక్కొక్కరి నుండి 5000 రూపాయల వసూళ్లు. 8. ఆర్ ఐ వద్ద మొక్కు తీర్చుకోకుండా తాసిల్దార్ కార్యాలయానికి నేరుగా వెళ్లే వారిపై విచక్షణ రహితంగా ప్రవర్తించడం. 9. నేను లోకల్.. నన్నేమీ చేయలేరు. నేను చెప్పేదే రూల్ అంటూ ప్రతిరోజు లాగే గురువారం కూడా బెదిరింపులకు పాల్పడ్డారు. నా ఫిర్యాదులను మీడియాలో వార్తలు రాసిన జర్నలిస్టులపై కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారని వారి ఆగడాలను తక్షణమే నియంత్రించాలని ఈ విధంగా అనేక అక్రమాలకు పాల్పడిన వాటిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసి ఉన్నందున. వాటి నుండి తప్పించుకునేందుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆనంద్ బాబు ను యధావిధిగా ఇదే మండలంలో కొనసాగిస్తే పై వాటికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసే ప్రమాదం ఉందని. కనుక వారిని వేరే ప్రాంతానికి మార్చేందుకు తగిన చర్యలు తీసుకొని. వారిపై వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.



## కేంద్ర బడ్జెట్ను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటరులో నిరసన ప్రదర్శన జరిగింది. ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం, విశాఖ ఉక్కు, విభజన హామీల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి మాటల తోనే సరిపెట్టిందని నేతలు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎండి. కరీముల్లా, ఆటోకార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదుల విధుల బహిష్కరణ




**జగ్గయ్యపేట జూలై 25 మేజర్ న్యూస్ :** వెల్ఫేర్ స్టాంప్ డ్యూటీ 60రూ గా ఉన్నపుడు అడ్వకేట్ బెనిఫిట్స్ 4 లక్షలు ఇచ్చారని కానీ అదే వెల్ఫేర్ స్టాంప్ డ్యూటీ 250రూ అయిన తర్వాత కూడా బెనిఫిట్స్ 4 లక్షలుగా కొనసాగించడం అత్యంత హేయమని అని కావున వెంటనే అడ్వకేట్ బెనిఫిట్స్ 25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో అన్నెపాగ సుందరరావు, ఇ వి జగన్నాధరావు, జంగా నరసరాజు,కరణం నరసింహారావు, శ్యామల నరసింహ రెడ్డి, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, వై. ధనుంజయ, జి. లక్ష్మి నారాయణ ఎం.కృష్ణయ్య, శ్రీనివాస గౌడ్, ఎం ఆంజనేయులు, కె. శ్రీనివాసరావు, పూల నాగరాజు, ఆర్. ప్రసాద్, డి. నాగేశ్వరావు, బిక్షమయ్య, చిన్న గాంధీ, శ్రీనివాసవి, తదితరులు పాల్గొన్నారు.

## మోకానాగు మృతదేహానికి నివాళులర్పించిన బండి రామకృష్ణ



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** బందరు మండలం పోలాటితిప్ప గ్రామానికి చెందిన మోకానాగు (45) అర్ధరాత్రి వేటకు వెళ్లి బోటు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు. మృతి చెందిన నాగు జనసేన పార్టీ రాష్ట్రమత్స్యకార వికాసవిభాగ కార్యదర్శి మోకా రవి సోదరుడు. మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ మోకానాగు మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటనను పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్తామని మృతుని కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్, పోలాటితిప్ప సర్పంచ్ మోకారాజు, పృధ్వి, సాయి, జనసేన & టీడీపీ నాయకులు పోలాటితిప్ప గ్రామస్తులు, మత్స్యకార నాయకులు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ కులాల ఐక్యవేదిక



**జగ్గయ్యపేట జూలై 25 మేజర్ న్యూస్ :** ఈ నెల 30వ తేదీ జగ్గయ్యపేట ఉక్కు కళావేదికలో జరిగే "అధికారం" చర్చా వేదిక కరపత్రం బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు జగ్గయ్యపేట సీతారాంపురంలో బహుజన సమాజ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు, రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాస్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు అంగడాల పూర్ణ చంద్రరావు,శాలివాహన సంఘం రాష్ట్ర నాయకురాలు పోలంపల్లి రాధ సంయుక్తంగా విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో బీ.సీ సంఘం నాయకులు వల్లూరి వెంకటేశ్వర్లు, తాళ్ళూరి దుర్గా,తోటకూర ఆదినారాయణ, పొల్ల రాజా,క్రిస్టియన్, మైనారిటీ నాయకులు వేల్పుల సురేష్,ప్రముఖ విద్యావేత్త కే.వి.రత్నం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఈ నెల 30 తారీఖున బిసి, ఎస్,సి ఎస్ టి, క్రిస్టియన్ మైనారిటీ చర్చా వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డీజీపీ జే పూర్ణ చంద్ర రావు, బీ.ఎస్.పి రాష్ట్ర అధ్యక్షులు బీ పరం జ్యోతి, మాజీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టర్,ఎల్.వి వందన కుమార్ పాల్గొంటారని వారు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న బిసి, ఎస్ సీ, ఎస్ టి,క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలు జూలై 30వ తేదిన జరిగే "అధికారం" చర్చా వేదికలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

NIIT UNIVERSITY
THE UNIVERSITY OF THE FUTURE
INDUSTRY-LINKED | TECHNOLOGY-BASED | RESEARCH-DRIVEN | SEAMLESS

### ఎన్ఐఐటీ యూనివర్సిటీ ఫ్యూచర్-రెడీ కెరీర్ ప్రోగ్రామ్లలో

## ప్రవేశానికి అందుబాటులో పరిమిత సీట్లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎన్ఐఐటీ యూనివర్సిటీలో అత్యాధునిక కెరీర్ ప్రోగ్రామ్లలో ప్రవేశానికి పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని యూనివర్సిటీ వెల్లడించింది. అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ముగియనుంది. రాష్ట్ర కౌన్సెలింగ్లో తాము కోరుకున్న విభాగంలో సీటు పొందని దక్షిణ భారతదేశ అభ్యర్థులు తమ ప్రాధాన్య విభాగంలో సీటును పొందే అవకాశం ఉంది. గరిష్టంగా 100 శాతం మెరిట్ ఆధారిత స్కాలర్షిప్లు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్లో బిటెక్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్లో బిటెక్, సైబర్ సెక్యూరిటీలో బిటెక్, బయో టెక్నాలజీలో బిటెక్, మూడు సంవత్సరాల బిబిఎ, నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అడ్మిషన్లు తెరవబడతాయి. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్లో బిటెక్ లను కూడా ఎంచుకోవచ్చు.

## నూతన శ్రేణి ఏసీలను ప్రవేశపెట్టిన శాంసంగ్ ఇండియా




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్, చిల్డ్ వాటర్ ఇండోర్ కేటగిరీలో కొత్త విండ్-ఫ్రీ ఎయిర్ కండిషనర్లను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త శ్రేణిలో విండ్-ఫ్రీ, 360 డిగ్రీ బ్లేడ్లెస్ టెక్నాలజీని చిల్డ్ వాటర్ ఆధారిత క్యాసెట్ యూనిట్ల లో కలిగి ఉంది. ఇది వినియోగదారులకు డైరెక్ట్ కోల్డ్ డ్రాఫ్ట్ అసౌకర్యం లేకుండా అత్యుత్తమ కూలింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది. ఈ సందర్భంగా శాంసంగ్ ఇండియా ఎస్ఏసీ బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విపిన్ అగర్వాల్ మాట్లాడుతూ, "చిల్డ్ వాటర్ ఫ్యాన్ కాయిల్ యూనిట్లు నిశ్శబ్దంగా పనిచేస్తున్నప్పుడు వేగవంతమైన వేగంతో ఉన్నతమైన చల్లదనాన్ని అందిస్తాయి. కూలింగ్ యూనిట్లు పెద్ద ప్రదేశాలకు అత్యంత సముచితమైనవి. ఎయిర్ఫ్లో సిస్టమ్లను మరింత అధునాతనంగా చేస్తూ అందరికీ అందుబాటులోకి వచ్చేందుకే మా ప్రయత్నం" అని అన్నారు.

## సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్కు దరఖాస్తులు ఆహ్వానం



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు లేదా సంస్థలు చేసిన అద్భుతమైన పనిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం "సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్" పేరుతో వార్షిక అవార్డును ఏర్పాటు చేసిందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను ప్రతి సంవత్సరం జనవరి 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రకటించడం జరుగుతుందని, అవార్డులలో ఒక సంస్థ లేదా వ్యక్తికి వరుసగా రూ.51 లక్షలు, 5 లక్షల నగదు పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో 2025 సంవత్సరానికి "సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం" కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల ఒకటవ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు అర్హులైన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను https://awards.gov.in వెబ్ సైట్లో పొందాలని సూచించారు.

## ఇంటిపత్రాలు పోయినవి

ఈనెల 23వ తేదీన విజయవాడ పూర్ణానందంపేటకు చెందిన పిసుపాటి వెంకట గురునాథ్ ప్రసాద్ గాంధీనగర్లో జిరాక్స్ తీయించుకుని ఒరిజినల్ ఇంటి పత్రాలను కవర్లో ఉంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి చేరుకుని చూసుకుంటే ఇంటి పత్రాలుంచిన కవర్ కనిపించలేదు. జిరాక్స్ దుకాణంలో ఆరాతీయగా అక్కడ లేనట్లు తెలిసింది. పత్రాలకు సంబంధించి డాక్యుమెంట్ నంబరు 3420, న్యూ అసెస్మెంట్ నంబరు 100509. ఈ పత్రాలు ఎవరికైన దొరికిన యెడల కింది తెలిపిన అడ్రస్లో కానీ, ఫోన్నెంబర్కి గాని తెలియజేయగలరు.

**పిసుపాటి వెంకట గురునాథ్ ప్రసాద్**
డోర్ నంబరు 16-03-28, కేఎస్ రావు వీధి, పూర్ణానందంపేట,
విజయవాడ, ఫోన్ నెంబర్: 9391477073

## ఎన్టీఆర్ జిల్లా సీపీని కలసిన ఎమ్మెల్యే వసంత



**ఇబ్రహీంపట్నం, జూలై 25, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబుని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్లో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు బాధితులకు సత్వరన్యాయం చేకూరేలా చట్టప్రకారం తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక టీడీపీ, మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డే



**ఇబ్రహీంపట్నం, జూలై 25, మేజర్ న్యూస్ :** స్థానిక నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, కోడింగ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. డేటా వ్యాలీ సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు కెరియర్ కౌన్సిలింగ్ అవేర్నెస్ భాగంగా ఈ సెమినార్ నిర్వహించారు. ఈ సదస్సులో డేటా వ్యాత్ టెక్నికల్ హెడ్ టి.సాంబశివరావు, మార్కెటింగ్ మేనేజర్ కె. సరసింహ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్స్ మీదే ఆధారపడి ఉందని, అందులో ప్రావీణ్యం సంపాదిస్తే మంచి జీతంతో స్థిరపడవచ్చని విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అక్బర్ ఖాన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ అజయ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**నందిగామ, జూలై 25, మేజర్ న్యూస్:** బార్ అసోసియేషన్ పిలుపుమేరకు, నేషనల్ ఇష్యూ అయిన భారతదేశ క్రొత్త క్రిమినల్ చట్టాలు ఉపసంహరించుకోవాలని, న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ 4 లక్షల నుండి 10 లక్షల వరకు పెంపుదల చేయాలని,నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షతన, న్యాయవాదుల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కోర్టు విధులను బహిష్కరించాలాని బార్ అధ్యక్షులు న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గురువారం కోర్టు ఆవరణంలో నిరసన తెలిపి, కోర్టు విధులు బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు,ట్రెజరర్ చార్టర్గడ్డ రవికుమార్,లైబ్రరీ ఆనందం విజయ్,స్పోర్ట్స్ పర్సన్ గుగులోత్ రామారావు, మన్నెం నారాయణరావు, పింగళి లక్ష్మీనరసింహారావు, ఈశ్వర పగడ రంగారావు, దగ్గుపాటి కమలాకర్ రావు, మాదుగుల స్టాలిన్, చెరుకుమల్లి రామారావు, కొమ్మినేని మౌళేశ్వరావు, వేల్పుల కిషోర్, గుడిశ సుమన్, దున్న కోటేశ్వరావు బెజవాడ గోపి, తదితరులు పాల్గొన్నారు.

## మురుగు డ్రైయిన్ల పూడిక తీత పనులు నిర్వహించాలి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేకనూరులో ఉన్న రెండు మెయిన్ డ్రైయిన్లో పూడిక తీత పనులు నిర్వహించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సబ్ డివిజన్ చల్లపల్లి వారికి వేకనూరు ఉపసర్పంచ్ తుంగల మురళీ వినతి పత్రం అందచేశారు. గురువారం అందచేసిన వినతి పత్రంలో గ్రామంలోని 5 వ నెంబర్ కాలువ పక్కన గల వీరన్న అలుగు ( డ్రైయిన్ ) అవనిగడ్డ నుండి నాగాయలంక వెళ్ళు కెఈబి కెనాల్ దగ్గర నుండి పెదగుడు మోటు దగ్గర రత్నకోడు వరకు ఉన్న, 3వ నెంబర్ కాలువ పక్కన గల డ్రైయిన్, అవనిగడ్డ నుండి నాగాయలంక వెళ్ళే కెఈబి కెనాల్ దగ్గర నుండి బందలాయిచెరువు నుండి పోటుమీద వరకు వెళ్ళే రోడ్డు వరకు ఉన్న ఈ రెండు డ్రైయిన్లు పూర్తిగా పూడుకుపోవడం వలన వర్షాకాలంలో పంట పొలాలు ముప్పుకు గురైయ్యి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ డ్రైయిన్లలో పూడిక తీసి చాలా సంవత్సరాలు అయ్యిందని అధికారులు దృష్టి పెట్టి రైతులు నష్టపోకుండా డ్రైయిన్లు అభివృద్ధి చేయాలని కోరారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు



**నందిగామ, జూలై 25, మేజర్ న్యూస్ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఏపీ రాజధాని అమరావతికి 15 వేల కోట్ల కేటాయించడంతో పాటుగా పోలవరం ప్రాజెక్టుని పూర్తిచేసే బాధ్యత కేంద్రం పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇవ్వటం,ఎర్రిపాలెం టు అమరావతి నంబూరు వరకు 56 కిలోమీటర్ల 2,500 కోట్ల ఖర్చుతో రైల్వే ప్రాజెక్టులు నిర్మాణం చేపడుతామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ వెల్లడించడం బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య మాట్లాడుతూ ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన మేలు ఆంధ్రప్రదేశ్ కి మంచి జరుగుతుందని ప్రజలందరికీ రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రానికి అభివృద్ధి జరుగుతుందని పిల్లల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పులిపాటి లక్ష్మణరావు. గంటా వెంకట్రావు, బండారు కేదార్నాథ్ శర్మ. కొత్త సాంబశివరావు, మునగంటి కామేశ్వరరావు. ఎర్ర గొర్ల లక్ష్మణ్, ఊటుకూరు సత్యనారాయణ గుప్తా, కేతేపల్లి ప్రసాదు, చిట్టెం వెంకటనారాయణ. ఉడత శ్రీధర్, కొత్త గోపీచంద్. పబ్బతి ప్రసాదు. వందేమాతరం అశోక్, చలమల కృష్ణ. కందుల మాధవరావు,మో రుమూరు శివ. స్వామి. మేకల రోజు. దామ కృష్ణ కుమారి,. రమాదేవి. చింతొటి రవి, బుర్ర వెంకట్రావు. పాల్గొన్నారు.

## నూజివీడులో జిల్లా ఎస్పీ పర్యటన



**నూజివీడు, మేజర్ న్యూస్:** నూజివీడు పట్టణంలో ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివకుమార్ గురువారం పర్యటించారు. నూజివీడు డిఎస్పి లక్ష్మయ్య పూలబొకే, పచ్చని మొక్క అందించి ఎస్పీ ప్రతాప్ శివకుమార్ కు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయం, పట్టణ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని, రాష్ట్రస్థాయిలో ఈ కొరతను ఉన్నతాధికారులు, ప్రభుత్వం భర్తీ చేసేందుకు త్వరలో కసరత్తు చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఇకమీదట నిబంధనలు పాటించని వాహన చోదకులకు భారీ జరిమానాలు, కఠిన చర్యలు తప్పవు అన్నారు. అక్రమ మార్గంలో దిగుమతి అవుతున్న గంజాయి విషయంలో ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇందుకోసం ప్రజలంతా సహకరించి, వాస్తవంగా జరిగే ఆధారాలను సకాలంలో అందించగలిగితే త్వరితగతిన కేసులను పరిష్కరిం చడమే కాక, స్వచ్ఛమైన శాంతియుతమైన గొప్ప సమాజాన్ని నిర్మించే అవ కాశం ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. పేకాట కోడిపందాలు నిర్వహించిన, ఆడిన కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి, రూరల్ సీఐ రామకృష్ణ, పట్టణ ఎస్ఐ లు రామకృష్ణ, ఎంవీఎస్ మూర్తి, రూరల్ ఎస్సై మల్లికార్జున రెడ్డి, ముసునూరు ఎస్సై పి వాసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ స్థాపన





**కంచికచర్ల జూలై 25 మేజర్ న్యూస్ :** డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, కంచికచర్ల ఇన్స్పెక్టర్ బి.సత్యనారాయణ సూచించారు. కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలలో ఎస్ ఈ బీ అడిషనల్ సూపరింటెండెంట్ కె.వి రామకృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్స్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నుండి యువతను, విద్యార్థులను చైతన్య పరిచేందుకు గురువారం మారకద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. రాష్ట్రం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ మోజులో పడి తమ భవితను నాశనం చేసుకుంటున్నారని, అటువంటి వారిలో చైతన్యం నింపేందుకు తల్లిదండ్రులతోపాటు అధ్యాపకులు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులతో యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో యాంటీ డ్రగ్స్‌ను తెలియజేసే హోర్డింగ్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు, ఏవో శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు ఏస్ఈబి ఎస్ఐ కళ్యాణి, నాగేంద్రకృష్ణ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి వుండాలి

## జగ్గయ్యపేట సీఐ జానకిరామ్






**పెనుగంచిప్రోలు జూలై 25 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని హైస్కూల్ లో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట సర్కిల్ సి.ఐ జానకిరామ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా స్పందించకూడదని, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 అందరూ తెలుసుకోవాలని ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ ఉపయోగించే వారు తెలియని లింక్స్ ఓపెన్ చేయకూడదు అని, ఆధార్ నంబర్ దానికి సంబంధించిన ఓటిపి నంబర్స్ ఎవరకి చెప్పకూడదు అని సి.ఐ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెనుగంచి ప్రోలు ఎస్.ఐ రాంబాబు,పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్స్, పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివస్ నేటితో 25 సం.లు పూర్తయిన సందర్భంగా కాగడాల ర్యాలీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి భారత మాతాకీ జై అని నినాదాలు చేస్తూ, కార్గిల్ యుద్ధంలో దేశం కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల ఆత్మ శాంతించాలని కోరుకుంటూ, శత్రు దేశమైన పాకిస్థాన్పై విజయం సాధించిన రోజు నేటి తరాలకు తెలియజేస్తూ కోనేరు సెంటర్ నుండి నవకల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసారని, వారి పోరాట ఫలితంగా భారతదేశ కార్గిల్ యుద్ధంలో గెలుపొందిందని తెలిపారు. 25 సంవత్సరాల క్రితం పాకిస్తాన్ తీవ్రవాదులు భారతదేశంపై దండెత్తి వచ్చి యుద్ధాన్ని ప్రకటించారు. వెంటనే అప్రమత్తమైన భారత సైన్యం పాకిస్తాన్ దుశ్చర్యలను తిప్పికొడుతూ విజయం సాధించింది. విజయం సాధించిన సందర్భంగా కార్గిల్ దివస్‌గా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. నేటితరం యువత దేశం కోసం దేశ ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువ మోర్చా కృష్ణాజిల్లా అధ్యక్షులు నాగలింగం మయోధ్య రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ, టీడీపీ అధ్యక్షులు ఇలియాస్ భాషా, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ గాంధీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం గత గజేంద్ర రావు, జనసేన నాయకులు గడ్డం రాజు, బీజేవైఎం నాయకులు పత్తిపాటి రమణ, యిర్రింకి నాగ శ్రీనివాస్, వీరమల్లు అభినందన ప్రసన్న కుమార్, ఈశ్వర్, కొత్త కిరణ్, ఘంటా సతీష్ కుమార్, మచిలీపట్నం అసెంబ్లీ కో- కన్వీనర్ శ్రీనివాస్, కునపరెడ్డి శ్రీనివాసరావు, మతి వెంకటేశ్వరరావు, గాయత్రి, బీజేపీ జనసేన టీడీపీ కూటమి నాయకులు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక భూహక్కు చట్టాన్ని రద్దు చేయించిన చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

### ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తారు : గొర్రెపాటి గోపీచంద్



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రజా వ్యతిరేక భూ హక్కు చట్టాన్ని రద్దు చేయడం పట్ల రాష్ట్ర ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. గతవైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టంపై అనేక ఆందోళనలు, అనుమానాలు జరిగిన విషయం తెలిసిందేనని, చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గత వైయస్సార్సిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దుచేసిలోకు హర్షం వ్యక్తం చేస్తూ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి గురువారం టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు, పలువురు టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గొర్రెపాటి గోపీచంద్ మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, సహా హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరును పునరుద్ధరించే బిల్లులను అసెంబ్లీ, శాసనమండలి ఆమోదించింది అన్నారు. శాసన సభలో ఆమోదం అనంతరం బిల్లును మంత్రి సత్యకుమార్ యాదవ్ శాసన మండలిలో ప్రవేశపెట్టారు అన్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ల్యాండ్ టైట్లింగ్ బిల్లులోని లోపాలను ఎత్తిచూపారు అని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట వైఎస్సార్సీపీ సర్కార్ చేసిన చట్టం రాక్షస చట్టంగా ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, అభివర్ణించారు అన్నారు. భూ దోపిడీల కోసమే ఈ చట్టాన్ని వైఎస్సార్సీపీ ప్రభుత్వం తెచ్చిందని గొర్రెపాటి గోపీచంద్ గత వైసిపి పాలకులపై మండిపడ్డారు. ప్రజలకు నష్టం కలిగించే భూ హక్కు చట్టాన్ని రద్దు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కు తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాదివాడ వెంకట నరసింహారావు, తిరు మాని సత్యనారాయణ, అద్దేపల్లి నిరంజన్ రావు తదితర తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులతో పాటు తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, పిప్పళ్ళ వెంకట కాంతారావు, తూమాటి బసవ శంకరరావు, గండికోట అంజిబాబు, చిన్నం శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరు, సీపీని కలిసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ సృజనని తదనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా నందిగామ నియోజకవర్గ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కలిశారు. ఈ సందర్భంగా కొన్ని విషయాలను చర్చించారు.

## విమానాశ్రయ విస్తరణలో భూ సమస్యల పరిష్కార చర్యలు తీసుకోవాలి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** గన్నవరంలో విమానాశ్రయ విస్తరణలో భూ సమస్యల పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డికే.బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి, గన్నవరంలో విమానాశ్రయ విస్తరణలో సేకరించిన భూములకు నష్ట పరిహారం చెల్లింపుల పెండింగ్, సిఆర్‌డిఏ ప్లాట్ల కేటాయింపులో సమస్యలు సమీక్షించారు. విమానాశ్రయ విస్తరణ లేఔట్ మ్యాప్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. విమానాశ్రయ విస్తరణలో సేకరించిన భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై గత సమావేశంలో చర్చించిన అంశాలపై, తీసుకున్న నిర్ణయాలపై అధికారులు తీసుకున్న చర్యలు సమగ్రంగా సమీక్షించారు. రైతులకు చెల్లించవలసిన నష్టపరిహారం పెండింగ్ సమస్యలు, వార్షిక కౌలు చెల్లింపు సమస్యలు, సిఆర్‌డిఏ ప్లాట్ల కేటాయింపు పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉన్నతాధికారులకు అవసరమైన లేఖలు పంపాలన్నారు. భూసేకరణ చెల్లింపుల తాజా స్థితిపై నివేదిక సమర్పించాలన్నారు. విమానాశ్రయం ప్రహరి లోపల విద్యుత్ స్తంభాలు తొలగింపు పూర్తయిందన్నారు. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి నిర్మాణాల వల్ల భద్రతా సమస్యలు రాకుండా చూడాలని, విమా నాశ్రయ సరిహద్దు వెంబడి కొందరు రైతులు పొలాలు సాగు చేస్తున్నారని, తద్వారా పక్షులు రన్ వే పైకి రావడం వల్ల విమాన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని విమానాశ్రయ అధికారులు గత సమావేశంలో తెలిపారని, వీటిపై తగిన వెరిఫికేషన్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాల న్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, గుడివాడ ఆర్డిఓ పద్మావతి, గన్నవరం తాసిల్దారు పవన్, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపర్డెంట్ తేజశ్వరరావు, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీగా ఆర్ గంగాధర్ రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా పోలీసు కార్యాలయంలోని విభాగాలైన ఏ సెక్షన్, బీ,సీ,ఈ,జీ,పీ సెక్షన్ లను స్వయంగా తనిఖీ చేసి రికార్డులు గూర్చి సెక్షన్ సూపరింటెండెంట్ లను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లలో ఉండే పోలీసు సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది అందరితో ముఖాముఖి మాట్లాడి వారు నిర్వర్తించే విధులు, విధి నిర్వహణలో ఏదైనా సమస్య ఉన్నది, ఇతర అంశాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్న నేరుగా వచ్చి తెలియజేయవచ్చని తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో చిల్లలవాగు పనులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డ వద్ద చిల్లలవాగులో గుర్రపుడెక్క తొలగింపు పనులు జరిగాయి. డ్రైనేజీ శాఖ ఇన్చార్జి డీఈఈ పి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పనులు చేపట్టారు. చిల్లలవాగులో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించేందుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో నిధులు విడుదల కాగా, జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ కృషితో షార్ట్ టెండరు పద్ధతిలో పనులు చేపట్టారు. దీంతో కొన్నిచోట్ల కూలీలు, యంత్రాల సహాయంతో గుర్రపుడెక్క తొలగింపు, మరికొన్ని చోట్ల స్ప్రేయింగ్ పనులు చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచనలతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా పనులు చేస్తామని డీఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

## డొంక రోడ్డుకు మరమ్మత్తు పనులు



**నందిగామ, జులై 25, మేజర్ న్యూస్:** మండలంలోని గొల్లమూడి గ్రామం నందలూరు డొంక రోడ్డు గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకుబురద కొయ్యగా మారి రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, గొల్లమడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు సొంత నిధులతో డొంక రోడ్డు మరమత్తు పనులు చేపట్టడం పట్ల పలువురు హర్షం వెళ్ళబుచ్చారు, 2014 టీడీపీ హయాంలో రైతుల ఇబ్బందులు దృష్ట్యా డొంక రోడ్డు కు నిధులు శాంక్షన్ అయింది, గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాలుగా దంకర్ రోడ్డు మరమతు పనులకు నోచుకోలేదు.. డొంక రోడ్డు బురద కయ్యగా మారి రైతులు నడవలేక నానా ఇబ్బందులు పడుతున్న నేపద్యంలో గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షుడు గాడిపత్రి శ్రీనివాసరావు మరమత్తు పనులకు చేపట్టడంతో పలువురు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## గన్నవరం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి ఏకగ్రీవ ఎన్నిక

**గన్నవరం, జూలై 25, మేజర్ న్యూస్ :** గన్నవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ మహా సభ గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక రాష్ట డిప్యూటీ జనరల్ సెక్రటరీ యండి ప్రసాద్, జోనల్ సెక్రటరీ వై యస్ రావు, రీజినల్ సెక్రటరీ వై వి రావు పరివేక్షణలో ఎన్నిక జరిగింది. గన్నవరం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా బి. సంజీవరావు, కార్యదర్శిగా టి. వి. కోటేశ్వరావు, ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా కార్యదర్శి టి వి కోటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వై ఎస్ ఆర్ యూనియన్ సభ్యులు ఎంప్లాయిస్ యూనియన్ లో చేరారు. అలాగే గన్నవరం డిపో నుండి 15 మంది వై యస్ ఆర్ యూనియన్ నుండి ఎంపిప్లాయీస్ యూనియన్ లో చేరటం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## సహాయ ఫౌండేషన్ చేపట్టిన రూ.15ల భోజనం కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పేద ప్రజల దీవెనలు, బందరు ప్రజల ఆశీస్సులతో దిగ్విజయంగా కొనసాగుతుంది. దాతలు తమవంతు సహాయాన్ని అందించగలరని సహాయ ఫౌండేషన్ వారు కోరారు. గురువారం పుట్టి చేతన్ రామ్ పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లి తండ్రులు భరత్ బాబు, లక్ష్మితులసి పేదలకు బోజనాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్టి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ బాషా, మహిళ విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, జాయింట్ సెక్రటరీ సుధాబత్తుల లక్ష్మి, రామవాణి పాల్గొన్నారు.

## ఘనంగా కన్నెకంటి వివాహ వేడుక



**నందిగామ, జులై 25, మేజర్ న్యూస్:** పట్టణంలోని శ్రీకరం కళ్యాణ మండపంలో ఓ దినపత్రిక ఎడిటర్, దళిత చైతన్య వేదిక అధ్యక్షులు కన్నెగంటి సజ్జనరావు కుమార్తె వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, డొక్కా మాణిక్యాలరావు, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ పత్రిక రంగం ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత యోగ శిక్షణ తరగతులకు మంచి స్పందన



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులు తమ ధైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించి చురుకుగా ఉద్యోగ విధుల్లో పాల్గొనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక చొరవతో నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో చేపట్టిన ఉచిత యోగ శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. ఈ శిక్షణా తరగతులు గత మూడు రోజులుగా ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు 65 మంది జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ కాకుండా నిరాటంకంగా సాగుతున్నాయి. జిల్లా సర్వోన్నతాధికారిగా పలు కార్యక్రమాలు, సమావేశాలతో పనుల ఒత్తిడి ఉన్నప్పటికీ లెక్క చేయక జిల్లా కలెక్టర్ గత మూడు రోజులుగా క్రమం తప్పకుండా ఉదయం 6 గంటలకే శిక్షణ తరగతుల్లో స్వయంగా పాల్గొంటూ యోగ సాధన చేస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వారు తన జీవన శైలిలో యోగా సాధనను ఒక భాగంగా చేర్చుకొని ముందుకు సాగుతున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు వారి సతీమణి పృధ్వి కళ్యాణి కూడా శిక్షణ తరగతులలో పాల్గొనడం చెప్పుకోదగ్గ విశేషం. యోగా గురువులు ముదిగొండ శాస్త్రి, మద్దాల చింతయ్య ఉద్యోగులకు సులభతర వ్యాయామం, కపాలభాతి, భస్త్రిక ప్రాణాయామం అనులోమ, విలోమా ప్రాణాయామాలు ధ్యానం తదితర యోగాసనాలలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కలెక్టర్, వారి సతీమణి యోగా గురువులు చెప్పిన విధంగా ఆహార నియమాలు పాటించడం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖర రావు, ఖజానా శాఖ ఉపసంచాలకులు రవికుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి యమ్. వెంకటేశ్వర ప్రసాద్, భూ సర్వే రికార్డుల ఏడి మనిషా త్రిపాఠి, విద్యుత్ శాఖ ఈఈ భాస్కర్ రావు,క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి తదితర జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది వారి కుటుంబ సభ్యులను కూడా ఈ శిక్షణ తరగతులకు తీసుకుని రావచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. యోగా సాధనతో తమ జీవన శైలిలో మార్పులు కనబడుతున్నాయని యోగా సాధకులు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. శారీరిక రుగ్మతలు, అనారోగ్యం పాలైతే లక్షలాది రూపాయలు వైద్యానికి ఖర్చు చేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే యోగాసనాలు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా నగరంలోనే అందుబాటులో జిల్లా కలెక్టర్ చొరవతో చేపట్టిన శిక్షణా తరగతులను ప్రతి ఒక్క ఉద్యోగి అందిపుచ్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.



## సీఎం చంద్రబాబును కలిసి సీపీఎం నేతలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీపీఎం నేతలు కలిశారు. సచివాలయంలో గురువారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు యం.ఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబురావు, కె ప్రభాకర్ రెడ్డి కలిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించడంపై సీఎంకు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మేరకు మెగా డీఎస్సీ ప్రకటించి 16,347 పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు నిర్ణయం, పెన్షన్లు రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంపు, త్వరలో అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై సంతకాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం నుండి రాష్ట్రానికి విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు సాధించాలని సీఎంను కోరారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం ఇవ్వాలని, పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేయడంతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించాలన్నారు.

## అమరావతికి ఇచ్చే ఆర్థిక సాయం మొత్తాన్ని గ్రాంట్‌గా మార్చాలి

**పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయం మొత్తాన్ని గ్రాంట్‌గా మార్చాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర విభజనతో ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ కారణాలతో అభివృద్ధికి నోచుకోని అమరావతి రాజధాని నిర్మాణం కోసం 15వేల కోట్ల రూపాయలు రుణం ఇప్పిస్తామని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనటాన్ని ఆక్షేపించారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న రూ.15వేల కోట్లు కేంద్ర గ్రాంట్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు ద్వారా మళ్లీ రుణభారం మోపటం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందనగా ఉందన్నారు. రుణాలు ఇప్పిస్తాం అనటాన్ని రాష్ట్ర ప్రజలు దీన్ని సమర్థించరని స్పష్టం చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో నిర్వాసితులకు పరిహారంపై కేంద్రం స్పష్టత ఇవ్వకపోవటంతో వారు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. నిర్వాసితులకు నిర్వాసితులకు కేంద్రమే రూ.30 వేల కోట్లు గ్రాంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి రుణభారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై మోపటం దుర్మార్గం అన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పూర్తి బాధ్యత కేంద్రం తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



**జగ్గయ్యపేట జూలై 25 మేజర్ న్యూస్ :** ఈనెల 28 ఆదివారం బాలుర ఉన్నత పాఠశాల నందు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని వ్యవస్థాపక అధ్యక్షులు వంగర సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక ముఖంగా మాట్లాడుతూ గత 22 సంత్సరాలుగా నిరంతర ప్రజాసేవలో మానవ సేవా సంస్థ అనేక సేవా కార్య క్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. దానిలో భాగంగా మానవ సేవా సంస్థ ఆధ్వర్యములో జగ్గయ్యపేట ప్రజలు సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ సేవా సంస్థ నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో డాక్టర్స్ డయాబెటిక్ వైద్యులు డాక్టర్ వేణు గోపాల్ రెడ్డి, గుండె జబ్బుల వైద్యులు డాక్టర్ వంశి కృష్ణ కామన, నరాలు, నాడీ వైద్యులు డాక్టర్ మహీధర్ రెడ్డి, జనరల్ వైద్యులు డాక్టర్ నిఖిల్ , కీళ్లు ఎముకులు వైద్యులు డాక్టర్ కడియాల జయకృష్ణ, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రవికుమార్, చర్మ వైద్యులు డాక్టర్ అర్చన మాధురి, మూత్రపిండాల వైద్యులు డాక్టర్ జి. శశిధర్, క్యాన్సర్ వైద్యులు డాక్టర్ ఎం గోపీచంద్, దంత వైద్యులు డాక్టర్.కె. శ్రీకర్, కంటి వైద్యులు సంధ్యా నేత్ర వైద్యశాల, ఆయు ర్వేదం వైద్యులు డాక్టర్ రవి బాబు, ఫీజియోథెరపి వైద్యులు డాక్టర్. రాజ శేఖర్, డాక్టర్ . కృపమణి పాల్గొంటారని తెలిపారు. అలాగే ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు అవసరమైన వారికి డాక్టర్ సలహా మేరకు షుగర్ పరీక్షలు , బీపీ పరీక్షలు, టుడి ఎకో పరీక్షలు , ఈసీజీ పరీక్షలు , అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు, క్యాన్సర్ కు సంబందించిన పి ఏ పి స్మెయర్ , సిఎ125, పి ఎస్ ఏ పరీక్షలు కూడా డాక్టర్స్ పర్యవేక్షణలో ఉచితముగా చేయబడును అని అన్నారు.మానవ సేవా సంస్థ ఆధ్వర్యములో నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు డాక్టర్స్ ఉచితముగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితముగా మందుల కూడా ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. మానవ సేవా సంస్థ ఆధ్వర్యములో నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు ఆరోగ్య శ్రీ కార్డు పై కంటి ఆపరేషన్స్ , గుండె సంబంధిత ఆపరేషన్స్ , అనుభవజ్ఞులైన డాక్టర్స్ పర్యవేక్షణలో ఉచితముగా చేయబడును మానవ సేవా సంస్థ నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరంను జగ్గయ్యపేట,, పరిసర ప్రజలు అందరు వినియోగించుకోవాలని వంగర సురేష్ కుమార్ తెలిపారు.

# రాష్ట్ర నలుమూలల నుండి పోటెత్తుతున్న అర్జీదారులు

**భూ సమస్యలు, భూ కబ్జాలపైనే అధిక అర్జీలు**

**వైసీపీ హయాంలో ఆగిన బిల్లులకోసం పలువురు విన్నపం**

**పిల్లల చదువు, ఫీజు రియంబర్స్ మెంట్, విదేశీ విద్య, సీఎం ఆర్ఎఫ్ సహాయానికి పలువురు అభ్యర్ధన**

**నామినేటెడ్ పదవులకు అర్జీలు ఇచ్చిన టీడీపీ నేతలు**

**ఇంకా వైసీపీకి తొత్తులుగా పనిచేస్తూ టీడీపీ నేతలను ఇబ్బంది పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరిన నేతలు**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** గడిచిన రాక్షస పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు... పేద, బడుగు, బలహీన వర్గాల భూములను కూడా వైసీపీ నేతలు కబ్జా చేశారు.. జగనన్న ఇళ్ల పేరుతో దగా చేశారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా మోసం చేశారు. అధికారులను తొత్తులుగా చేసుకుని ఇష్టానుసారంగా వైసీపీ నేతలు ప్రవర్తించారు. పేదల ఇళ్లను కూల్చారు. బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. కూటమి అధికారంలోకి రావడంతో నేడు వారి బాధితులు టీడీపీ కేంద్ర కార్యాలయానికి అర్జీలు తీసుకుని పోటెత్తుతున్నారు అని.. మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు.

తెలుగుదేశం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వారు ఇరువురు అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. వైసీపీ పాలనలో అరాచకాలకు అకృత్యాలకు రాష్ట్రంలో పేదలకే ఎక్కువగా అన్యాయం జరిగిందని.. నియంత జగన్ పాలనలో ఎవరికి తమ గోడు చెప్పుకోవాలో తెలియక.. అధికారుల వద్దకు వెళ్లినా పట్టించుకోక.. పేద ప్రజలు తీవ్రంగా నష్టపోయారని.. మంత్రి వాసంశెట్టి, మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. నేడు పేదల ప్రభుత్వంగా కూటమి ప్రజా సమస్యల పరిష్కారని పెద్దపీట వేసిందని.. ప్రజా నాయకుడు, పేదల పెన్నిధి, నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి తపించే మానవతావాది. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు ఆదేశానుసారం.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి వెంటనే పరాష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతే కాకుండా వెనువెంటనే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను విన్నవించి పరిష్కరించవలసిందిగా సూచించినట్లు తెలిపారు. అధికారులు కూడా మానవతాదృక్పదంతో ప్రజా సమస్యల పరిష్కారాని కృషి చేసి.. అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని కోరారు.

– కడప జిల్లా శ్రీ అవధూత కాశినాయన మండలానికి చెందిన పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి అనే బాధితుడు తమకు వారసత్వంగా వచ్చిన భూమి 5 ఎకరాల 26 సెంట్లకు వైసీపీ నేతలు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి లింగారెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మొరపెట్టుకున్నాడు. కోర్టు తనకే అనుకూలంగా తీర్పు ఇచ్చినా... తన భూమిలో తనను సాగు చేసుకోనివ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనపై దయ ఉంచి న్యాయం చేయాలంటూ గ్రీవెన్స్ లో విన్నవించుకున్నాడు. వెంటనే మాజీ మంత్రి జవహర్ ఆనియోజకవర్గ సమన్వయ కర్త రితీష్ రెడ్డికి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించవలసిందిగా తెలిపారు.

– గత ప్రభుత్వ హయాంలో అధికారులను లోబరుచుకొని రికార్డులను తారుమారు చేసి తమ భూముల వివరాలను మార్చేసి... పొలం తమదై అయినా వేసిన పంటలను వారు దౌర్జన్యంగా కోసుకుపోతున్నారని.. బీలా పార్వతి వాపోరు. ఏలూరు అదనపు జిల్లా న్యాయస్థానం తనకు సానుకూలంగా తీర్పు ఇచ్చినా అప్పన్న కుమారుల దౌర్జన్యాలు ఆగడంలేదని వాపోయారు. దీంతో మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ అక్కడి డీఎస్పీకి ఫోన్ చేసి భూ సమస్యను వివరించి... సమస్య పరిష్కరానికి కృషి చేయాలని విన్నవించారు.

– విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం దన్నానపేట గ్రామంలో సుమారు వంద సంవత్సరాల నుండి జీవిస్తున్న ఎస్సీ మాల కుటుంబాలకు చెందిన 30 నీరుపేద కుటుంబాల ఇళ్లను టీడీపీకి అనుకూలంగా ఉన్నారని జేసీబీలు తీసుకు వచ్చి కూలగొట్టించారని నెల్లిమర్ల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు టొంపల నర్సయ్య వాపోయారు. పేదల ప్రభుత్వమైన కూటమి ప్రభుత్వం తమ యందు దయ ఉంచి ఎస్సీలకు పక్కా ఇళ్లు కట్టించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

– ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామానికి చెందిన ఎన్. వెంకటేశ్వర్లు తమకు ఉండటానికి నివాసం లేదని.. తమ యందు దయ ఉంచి ఇంటిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాడు

– ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికపాడు గ్రామానికి చెందిన కె. వినోద్ బాబు, డి రవీంద్రబాబు, ఎం. చైతన్యలు వారి గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజ్ సమస్యలు, సీసీరోడ్డు సమస్యలు, మంచినీటి ట్యాంక్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి సమస్యలను మంత్రి, మాజీ మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఆ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

– ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన దేవండ్ల తిరుపయ్య తమకు పరిహారం చెల్లించకుండా తమ భూమిలో ఎన్ ఎచ్ 167బీ రోడ్ నిర్మాణం చేపడుతున్నారని.. కోల్పోతున్న భూమి వాస్తవ విస్తీర్ణం చూపించకుండా తక్కువ చూపిస్తున్నారని ఎన్నిసార్లు రెవెన్యూ , ఎన్. హెచ్ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని గ్రీవెన్స్ లో వినతిని అందించారు. తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.

– అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలం, కుందుర్పి ఎస్సీ కాలనీలో కనీస మౌలిక వసుతులు లేవని... రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గత ప్రభుత్వం ఏనాడు తమ కాలనీని పట్టించుకోలేదని.. ఆ కాలనీ వాసులు నేడు మంగళగిరి గ్రీవెన్స్ మొరపెట్టుకున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

– కర్నూలు జిల్లా మద్దికెర మండలం, మద్దికెరకు చెందిన మాచినేని వెంకటేశ్వరులు తాను నిరుపేదనని.. తనకు వచ్చిన వ్యాధి కారణంగా కర్నూలులోని అమిలియో హాస్పిటల్ నందు ట్రీట్ మెంట్ చేసుకున్నట్లు.. దానికి సుమారు లక్షకు పైనా ఖర్చు అయినట్లు... పేదరికం కారణంగా తాను అంత డబ్బులు చెల్లించలేనని తనకు సీఎం ఆర్ఎఫ్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

– తోటకూర కిరణ్ కుమార్ తనకు ఆరోగ్యం సరిగ్గా లేదని.. తనకు ఇద్దరు ఆడబిడ్డలని.. వృత్తి రిత్యా తాపీ పని చేసుకుంటున్న తాను ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో సంపాదన లేదని... తన బిడ్డలను చదివించుకోలేకపోతున్నానని ప్రభుత్వం తనకు సాయం చేయాలని విన్నవించుకున్నాడు.

– షేక్ మహ్మద్ జాయెద్ నీట్ లో 244 మార్కులు సాధించి విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకున్న తాను గత ప్రభుత్వ విధానాలవలన తన చదువకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తన సమస్యను పరిష్కరించి నిరుపేద మైనార్టీ అయిన తనను ఉన్నత విద్య కొనసాగుటకు విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా స్కాలర్ షిప్ మంజూరు చేయాలని కోరారు.

– నూక చెన్న వర్ధన్ అనే విద్యార్థి తనకు ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు రావడంతో గుంటూరు వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటో బీటెక్ జాయిన్ అయ్యేందుకు సీటు వచ్చిందని... తనకు వచ్చిన మార్కుల వలన కాలేజీ కొంత ఫీజు తగ్గించిన కూడా మీగిలిన రూ. 3లక్షల ఫీజును తాను కట్టుకోలేనని విద్యాశాఖ మంత్రి తన చదవుకు ఆదుకోవాలని గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేశారు.

– విజయవాడ నగరపాలక సంస్థ వెహికిల్ డిపోలో గత 27 సంవత్సరాలుగా పనిచేస్తున్నమెకానిక్స్, హెల్పర్లను క్లీన్ ఎన్విరాల్మెంట్ లో చేర్చి జీతాలు పెంచి తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి మంత్రి, మాజీ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

– రాయల సీమకు చెందిన పలువురు టీడీపీ నేతలు మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లో ఇంకా పలువురు అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తూ.. టీడీపీ నేతలను ఇబ్బంది పెడుతున్నారని.. ముఖ్యంగా పోలీస్ శాఖలో వారు ఉన్నారని వారిని మార్చాలని విజ్ఞప్తి చేశారు.

## గంబూసియా చేప పిల్లలతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎంటిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 12 గంటలకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి లో కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ అధ్యక్షతన గురువారం మంగళగిరి నగరంలో అన్ని వార్డుల నందు గంబూసియా చేప పిల్లలను మంచి నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో వదలడం జరుగిందని అన్నారు. తద్వారా కీటకాల ద్వారా వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చుని , నగర పాలక సంస్థ వారు దాదాపు యాభై వేల చేప పిల్లలను నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో వదిలేందుకు సన్నాహా లు చేస్తున్నారు అని అన్నారు. ప్రజలు అందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షా కాలం వలన వచ్చే నీరు అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి కావున తాగునీటిని వేడి చేసుకుని త్రాగవలెను మరియు పరిసరాలలో నీరు నిలవ ఉండి దోమలు చేరకుండా జాగ్రత వహించాలి అని అన్నారు. నగరపాలక సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకోవటం జరుగుతుంది. ప్రజలు పారిశుధ్య సమస్యలను శానిటేషన్ సెక్రటరీల దృష్టికి తెచ్చి పరిష్కరించుకొనవలెనని. ఇతర సమస్యలు నగరపాలకసంస్థకు తెలియజేసి పరిష్కరించుకొనవలెనని అన్నారు. నగరపాలకసంస్థ నీటి ద్వారా వచ్చే వ్యాధులను, డెంగ్యూ, మరియు ఇతర కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకొనవలసిన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎంపీహెచ్ఈఓ, ఏఎన్ఎంలు శానిటేషన్ సెక్రటరీ లు మలేరియా అధికారి ,ఇతర మలేరియా అధికారులు ప్రజా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



## జల్ జీవన్ ప్రాజెక్టులోని అవాంతరాలను తొలగించండి

**ఇప్పటికే రూ. 350 కోట్లు మంజూరయ్యాయి**

**కొన్ని చోట్ల 1200 అడుగులు బోర్లు వేస్తేనే నీరందే పరిస్థితి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి**

**ఓవర్ హెడ్ ట్యాంక్ లకు నీటిని నింపితేనే ఇంటింటికి కనెక్షన్ లు**

**పార్లమెంట్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు**

**ఆధునాతన టెక్నాలజీ ద్వారా నీరు పడే ప్రాంతాల్ని గుర్తిస్తాం : కేంద్ర మంత్రి**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** పల్నాడులో జలజీవన్ ప్రాజెక్టు ముందుకు వెళ్ళటంలోని అవాంతరాలను తొలగించి ప్రతి ఇంటికి నీరందించెందుకు సహకరించాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు రూ. 350 కోట్లు నిధులు మంజూరయ్యి ఉన్నాయని అన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపి, అక్కడినుంచి ప్రతి ఇంటికి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, కానీ పల్నాడులో ఈ ట్యాంక్ లను నింపేందుకు నీటి కొరత ఉందని, కొన్ని ప్రాంతాల్లో దాదాపు 1200 అడుగులు బోర్లు వేస్తేనే నీరు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఈ స్థితిలో ప్రత్యామ్నాయ ప్రణాళికతో నీటి సమస్యను పరిష్కరించేందుకు సహకరించాలని, పెద్ద మొత్తంలో మంజూరయిన నిధులు వృధా కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్ర జల వనరుల మంత్రి సిఆర్ పాటిల్ మాట్లాడుతూ..పలు సమావేశాల్లో ఈ సమస్యలు ఉత్పన్నం అయ్యాయని, పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని, అధునాతన టెక్నాలజీని ఉపయోగించి, నీరు ఎక్కడ లాభ్యమౌతుంది, ఎక్కడ బోర్లు వేస్తె నీరు పడుతుంది అనే విషయాన్ని తెలుసుకోవచ్చుని, కొన్ని గ్రామాల్లో అవసరాన్ని బట్టి రెండు బోర్లు కూడా వెయ్యాల్సి వస్తోందని బదులిచ్చారు.

# రేపటి నుండి మోపిదేవి స్వామివారి ఆడి కృత్తిక ఉత్సవాలు ప్రారంభం








**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహిమాన్విత పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం ఆడి కృత్తికను పురస్కరించుకుని శనివారం నుండి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్,ఆలయ కార్య నిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఆషాఢమాసంలో వచ్చే ఈ నక్షత్రాన్ని స్వామివారి జన్మనక్షత్రం గా పరిగణించి ఆ సేతు హిమాచల పర్యంతం స్వామి వారి పుట్టినరోజు స్వామి వారి యొక్క జన్మ నక్షత్రం సందర్భంగా ఉత్సవాలు జరగడం ఆనవాయితీ గా వస్తుంది. అదే విదంగా మోపిదేవి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్ర హ్మణ్యేశ్వర స్వామి వారికి ది.27-7-2024 నుండి 30-7-2024 వరకు ఆడికృత్తిక మహోత్సవం జరుపుటకు స్వామి వారి అనుజ్ఞ అయినదనీ ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. స్వస్తిశ్రీ చాంద్ర మాన శ్రీ క్రోధి నామ సంవ త్సర ఆషాడ బహుళ సప్తమి అనగా ది.27-07-2024 స్థిర వారం నుండి ఆషాడ బహుళ నవమి అనగా ది.29-07-2024 సోమవారం వరకు శ్రీస్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ది. 30-7-2024 మంగళవారం శ్రీ స్వామివారి జన్మనక్షత్రం ఆషాడ కృత్తిక మహోత్సవం అత్యంత వైభోవోపేతంగా జరుగుతాయని, ఈ కార్యక్రమంలో భాగంగా ఉ.10గంటలకు విఘ్నేశ్వర పూజ, 108 కలశా లతో అష్టోత్తరం కలశాలతో అభిషేకం, చతుర్వేద పండితులు 11 మంది ఋత్విక్కులచే మహన్యాస పారాయణ, స్వామివారికి పంచామృతాలు వివిధ రకాల పండ్ల రసాలతో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రా భిషేకాలు, శాఖంబరీ అలంకరణ జరుగునని తెలి పారు. సా.3 గంటలకు లక్ష బిల్వార్చన, 4 గం. లకు రుద్ర హోమం, 5 గం.లకు శాంతి కల్యాణం సా.6 గం.లకు మహా నివేదన, 6:30 గం.లకు పంచ హారతులు చతుర్వేద స్వస్తి తీర్థ ప్రసాద వినియోగం జరుగును అని తెలిపారు. 30వతేది స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే మాహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అష్టోత్తర కలశాభిషేకం లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణంలలో పాల్గొనే భక్తులు 3 వేలరూపాయలు 29వతేది సోమవారం సాయంత్రం లోపు చెల్లించి రసీదు పొందాలని సూచించారు. శ్రీ స్వామి వారి పవిత్రోత్సవాల్లో శాంతి కల్యాణము, రుద్రాభిషేకం తాత్కాలికంగా నిలిపివేయబడునని తెలిపారు. 30 మంగళవారం శ్రీ స్వామివారి శాంతి కళ్యాణం సా. 5 గం.లకు జరుపుకోబడుతుందని తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో జరిగే ప్రత్యేక పూజా అధికారాలు భక్తులు ఆదిశంకలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను సేకరించాలని వారు కోరారు.

# అన్న క్యాంటీన్‌కి అన్ని వసతులు ఉండేటట్టు చర్యలు తీసుకోండి

### అధికారులకు ఆదేశాలు ఇచ్చిన కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర గురువారం తన పర్యటనలో భాగంగా సర్కిల్ 2, ధర్నా చౌక్ పక్కన గల అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో అన్ని వసతులు కలిగి ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని, ఫ్లోరింగ్ ఫినిషింగ్ నాణ్యత ప్రమా ణాలతో చేయాలని, తాగునీటి సౌకర్యాలు ప్రజలకు కల్పించాలని, అన్న క్యాంటీన్ ఆవరణలో పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించేటట్టు చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో పాటు ఎగ్జిక్యూటివ్ జోనల్ కమిషనర్ -2 ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 2 శ్రీనివాసరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ 2 రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా నూతన పోలీస్ శిక్షణ కేంద్ర నిర్మాణం జరగాలి

### జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పోలీస్ శిక్షణార్థం రాబోవు బ్యాచులకు ఉత్తమ శిక్షణ అందించడానికి త్వరగతిన నూతన పోలీస్ శిక్షణ కేంద్రం నిర్మాణం జరగాలని దానికి కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు పోలీస్ హౌసింగ్ ఇంజనీర్లతో నూతన పోలీస్ సైట్ ను సందర్శించారు. నూతనంగా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని నిర్మించడానికి కావలసిన అనుమతులు, భవన నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయడానికి సహకరించాలని, అలాగే పోలీస్ శాఖలోకి నూతనంగా ప్రవేశించబోయే పోలీస్ సిబ్బందికి శిక్షణ అందించడానికి అన్ని వసతులతో కూడిన శిక్షణ కేంద్రాన్ని సకాలంలో నిర్మించాలని, దాని కొరకు అందరం సమిష్టిగా కృషి చేయాలని, అందరి సహకారంతోనే సాధ్యమని అన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ (అడ్మిన్) జి వెంకటేశ్వరరావు, డిటిసి డిఎస్పి రమేష్, పోలీస్ హౌసింగ్ బోర్డ్ ఐజుజు శ్రీనివాస్, సిఐ సోమేశ్వరావు, హౌసింగ్ బోర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్స్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం.ధ్యానచంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ని మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి కమిషనర్ హెచ్‌ఎం ధ్యాన చంద్రని స్వాగతిస్తూ, పూల మొక్కను ఇచ్చారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వృద్ధులకు శ్రీరామ వెల్ఫేర్ సోసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక ఫైత్ హోమ్ చర్చిలో గురువారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వర్షాకాలం, శీతాకాలం దృష్టిలో పెట్టుకుని చలికి తట్టుకునేందుకు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విలియం కేరి, ఎబి నేజ, ఆదాం, బాబూరావు, కొండలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 43వ డివిజన్లో దెబ్బతిన్న ర్యాంపుల నిర్మాణం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 43వ డివిజన్లో దెబ్బతిన్న ర్యాంపులను చలమలశెట్టి శ్రీనివాస్, అక్కిశెట్టి ఉదయ్ సహకారంతో ర్యాంపుల నిర్మాణం ఏర్పాటు చేశామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాల శౌరి, మంత్రి కొల్లు రవీంద్ర విజయాన్ని పురస్కరించుకొని తమ సొంత నిధులతో నిర్మాణం చేపట్టారని బండి రామకృష్ణ తెలిపారు. (రూ.15000 వేలు) సొంత లాభం కొంత మానుకుని సమాజ శ్రేయస్సు కోసం తమ సొంత సంపాదనలో కొంత భాగం వినియోగిస్తున్న శ్రీనివాసరావు ఉదయ్ అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, 43వ డివిజన్ జనసేన - టీడీపీ ఇన్చార్జులు కొలపల్లిగణేష్, ఉకంటి రాంబాబు, చలమశెట్టి రమేష్, ఏడుంబాకులవాసు, మంత్రి పృద్వి, వడ్డీహరి సాయి, డివిజన్ జనసేన - టీడీపీ - బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## నేడే డయల్ యువర్ డీఎం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** శుక్రవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి 12.30 నిమిషాల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలు ఫోన్ నెం 9959225466 కు తెలియచేయాలన్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999